సాక్షి శ్రీకాకుళం

గురువారం । 10 । ఆగస్టు । 2023



టీడీపీ నేతల ధనదాహానికి..

టీడీపీ పాలనలో జరిగిన అక్రమాలకు ఇప్పుడు అధికారులు బలయ్యారు. నాడు పర్యవేక్షక ఇంజినీర్లుగా పనిచేసిన 8 మంది సస్పెన్షన్‌కు గురయ్యారు.

- 8లో



గిరిపుత్రుల సంక్షేమం

గిరిపుత్రుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మందసలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

- 8లో

నవోదయ గడువు పెంపు

సరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

కొత్తమ్మతల్లి ఆదాయం రూ.4.36 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి అమ్మవారి హుండీ కానుకల ఆదాయాన్ని బుధవారం సోంపేట దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద బాబు ఆధ్వర్యంలో లెక్కించారు. 75 రోజులకు గాను రూ.4,36,833 ఆదాయం సమకూరినట్లు ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ బోయిన మాధవి, భక్తులు పాల్గొన్నారు.

పథకాల లబ్ధిదారులకు ఈకేవైసీ తప్పనిసరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: డీబీటీ విధానంలో బ్యాంకు ఖాతాల్లో జమవుతున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని బీసీ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ జి.సి.కిషోర్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని బీసీ కార్పొరేషన్ మందిరంలో బుధవారం నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడుతూ జగనన్న అమ్మఒడి, చేయూత, చేదోడు, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, మత్స్య భరోసా, నేతన్ననేస్తం, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాల లబ్ధిదారులకు ఈకేవైసీ చేయించాలన్నారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వనాథరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు డీవార్మింగ్ డే



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

అరసవల్లి: జిల్లాలో అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు (డీవార్మింగ్) పక్కాగా వేయించేలా చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వారికి డీవార్మింగ్ నివారణకు ఆల్బెండజోల్ (400 ఎంజీ) మాత్రలను తప్పనిసరిగా నమిలించి తినిపించాలని సూచించారు. జిల్లా మొత్తం 4,44,162 మాత్రలను పంపిణీ చేయించామని తెలిపారు. 1 నుంచి 2 ఏళ్ల లోపు పిల్లలకు సగం మాత్ర, 19 ఏళ్ల లోపు వారికి పూర్తి మాత్ర వేయించాలన్నారు. ప్రతి పాఠశాలలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు మాత్రలు వేయించాలన్నారు. వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో కార్యక్రమం జరుగనుందన్నారు. మాత్రల వినియోగంపై అపోహలు తొలగించే చర్యలు కూడా చేపడుతున్నట్లు వివరించారు . ఈ నెల 17న మాప్‌అప్ డే చేపడుతున్నట్లు తెలిపారు.

ఉత్తమ గ్రంథాలయాధికారిగా ఉగ్రసేన



అవార్డు అందుకుంటున్న ఉగ్రసేన

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ఉత్తమ లైబ్రేరియన్‌గా బలగ గ్రంథాలయశాఖ అధికారి పి.ఉగ్రసేన ఎంపికయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో బుధవారం గ్రంథాలయ ఉద్యోగుల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు సువ్వారి సువర్ణ చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారు.

ఉద్యోగాల పేరిట టోకరా

కోటబొమ్మాళి: మండలంలోని మంచాలపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు రైల్వే ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి రూ.15లక్షలు తీసుకొని మోసం చేశారని జర్జంగికి చెందిన ఇద్దరు నిరుద్యోగ యువకులు బుధవారం కోటబొమ్మాళి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచాలపేటకు చెందిన అనపాన అశోక్, అతని తండ్రి కామేశ్వరరావు రైల్వేలో టీటీఈ ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి జర్జంగికి చెందిన జీరు పూర్ణచంద్రరావు, దుద్ది చంటిడు వద్ద నుంచి చెరో రూ.7.50 లక్షల చొప్పున తీసుకున్నారు. నకిలీ జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చారు. వాటిని తీసుకొని పశ్చిమ బెంగాల్‌లోని ధనఖాలి రైల్వేస్టేషన్‌కు వెళ్లగా అవి నకిలీవని తేలింది. తాము మోసపోయామని, అప్పుచేసి డబ్బులు ఇచ్చామని, తమకు న్యాయం చేయాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

ఏం చేశారని.. వేంచేస్తున్నారు బాబూ..?



ఇటీవల నిర్వహించిన ఉద్దానం మంచినీటి ప్రాజెక్ట్ ట్రయల్ రన్

- సిక్కోలులో కనిపించని చంద్రబాబు ముద్ర
- టీడీపీ పాలనంతా హామీలకే పరిమితం
- వైఎస్ ఫ్యామిలీతోనే సిక్కోలు ప్రగతి పథం
- ఇరిగేషన్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది వైఎస్సార్
- నాటి ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నదీ నేటి ప్రభుత్వమే
- ఏమీ చేయని చంద్రబాబు ప్రాజెక్టుల పరిశీలన పేరుతో మొసలి కన్నీరు
- నేడు జిల్లాకు చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: సిక్కోలుపై తెలుగుదేశం పార్టీకి ఎప్పుడూ చిన్నచూపే. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు తన పాలనకు గుర్తుగా జిల్లాలో ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టూ చేపట్టలేదు. అధికారంలో ఉన్నంతసేపూ స్వప్రయోజనాలు, నిర్లక్ష్యం .. అధికారం పోయాక మళ్లీ తానొస్తే అన్నీ చేసేస్తానని చెప్పుకోవడం చంద్రబాబుకు అలవాటైపోయింది. సిక్కోలు ప్రగతిలో చంద్రబాబు ముద్ర ఎక్కడా కన్పించడం లేదు. నాడు వైఎస్సార్...నేడు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే అభివృద్ధికి అడుగులు పడ్డాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్ చేపట్టిన పనులు చివరి దశకొచ్చాయి. కొన్ని ప్రగతి దశలో ఉన్నాయి. ఇవన్నీ పూర్తయితే జిల్లా ముఖచిత్రం మరింత మారనుంది. పదవిలో ఉన్నంతకాలం ఏమీ చేయని చంద్రబాబు ఇప్పుడు ప్రాజెక్టుల పరిశీలన పేరుతో మరోసారి ప్రజల్ని మభ్యపెట్టడానికి గురువారం జిల్లాకొస్తున్నారు.

వైఎస్సార్ హయాంలో..

శ్రీకాకుళంకు ఓ పెద్దాసుపత్రి ఉండాల్సిందేనని భావించి ప్రజలు కోరకుండానే ఒక ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేశారు. రూ.119కోట్లు కేటాయించారు. 300 పడకల జిల్లా కేంద్ర ఆసుపత్రిని 500 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశారు. ఏటా జిల్లా నుంచి వందల మంది వైద్యులను తయారు చేసే కళాశాల శంకుస్థాపన, ప్రారంభోత్సవం రెండూ ఆయన చేతుల మీదుగానే జరిగాయి.

- సిక్కోలు జిల్లాకు యూనివర్సిటీని అందించిన ఘనత వైఎస్సార్‌దే. ఎచ్చెర్లలో 2008 జూలై 25న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఏర్పాటు చేశారు. ఇప్పుడిది గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉన్నత విద్యావేత్తలుగా తీర్చిదిద్దుతోంది.
- 2.50లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ చేశారు. అప్పటికే రుణాలు చెల్లించేసిన వారికి రూ.5వేలు చొప్పున ప్రోత్సాహం అందించారు.
- నాగావళి, వంశధార నదుల వరద ఉధృతి నుంచి పంట పొలాలను, ఆవాసాలను రక్షించేందుకు రూ.300 కోట్లతో కరకట్టల నిర్మాణాలకు సంకల్పించారు.
- ఉమ్మడి జిల్లాలోని సీతంపేట ఏజెన్సీలో 14వేల ఎకరాల్లో 5వేల మంది గిరిజన రైతులకు పట్టాలు ఇచ్చారు.
- శ్రీకాకుళంలో కొత్త కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు పనులు చేపట్టారు.

సీఎం వైఎస్ జగన్ పాలనలో..

- జిల్లాలో అత్యధిక ఆయకట్టులో మూడు పంటలు పండాలంటే ముందు వేసవిలో వంశధార కాలువ నిండుగా ప్రవహించాలి. హిరమండలంలోని వంశధార రిజర్వాయర్‌కు 19.5 టీఎంసీల నీరు వచ్చి చేరాలి. ఆ పరిస్థితి లేదు. నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు కారణంగా ఈ లోపు మొత్తం ఆయకట్టును సస్యశ్యామలం చేయాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ తప్పనిసరి అని వైఎస్ జగన్ ప్రభుత్వం భావించింది. ఆ ఆలోచనతో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేసింది. ఈ కల నెరవేర్చేందుకు అడుగులు వేస్తోంది. వర్షాలు తగ్గుముఖం పట్టాక లిఫ్ట్ పనులు ప్రారంభించనుంది. గొట్టా బ్యారేజీ ఎగువన కొరాడ గ్రామం వద్ద రూ.140 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకం నిర్మించి సుమారు 100 రోజుల వ్యవధిలో 16 గంటల పాటు పంపింగ్‌తో 2.5కిలోమీటర్ల దూరంలో ఉన్న హిరమండలం రిజర్వాయర్‌కు 12టీఎంసీలకు పైగా నీటిని లిఫ్ట్ చేయనున్నారు. దాని ద్వారా ఖరీఫ్, రబీలో మొత్తం ఆయకట్టుకు నీరందించనుంది.



- మహేంద్ర తనయ పనులు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. వైఎస్సార్ హయాంలో ప్రారంభించిన పనులను పూర్తి చేసే బాధ్యత ప్రస్తుత వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంది. తొలుత 26 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, పలాస పట్టణానికి తాగునీరు అందించేందుకు రూ.800 కోట్లకు పైగా ఖర్చు పెడుతోంది. ఇప్పుడా పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- నాగావళి-వంశధార నదుల అనుసంధానం పనులు పూర్తి చేసే బాధ్యతను వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంది.
- ఉద్దానాన్ని పట్టిపీడిస్తున్న కిడ్నీ వ్యాధిని నియంత్రించేందుకు రూ.700 కోట్లకు పైగా ఖర్చు పెట్టి భారీ మంచినీటి ప్రాజెక్టు పనులను అధికారంలోకి రాగానే ప్రారంభించారు. త్వరలోనే ప్రారంభం కానుంది. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ఏడు మండలాలతో పాటు పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టి ప్రజలకు శుద్ధజలం అందించేందుకు పనులు చేపట్టింది. హిరమండలం రిజర్వాయర్ నుంచి సంవత్సరానికి 1.12 టీఎంసీల నీటిని వినియోగించనున్నారు.
- కిడ్నీ వ్యాధిని అదుపులోకి తెచ్చేందుకు పలాసలో రూ.50 కోట్లకు పైగా వ్యయంతో కిడ్నీ రిసెర్చ్ కమ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని జగనన్న ప్రభుత్వం నిర్మించింది. త్వరలోనే ప్రారంభం కానుంది.
- జిల్లాకే తలమానికంగా నిలిచే మూలపేట పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ.2,949.70కోట్లతో తొలి విడత ప్రాజెక్టు పనులు చేపడుతోంది. ప్రాజెక్టు పూర్తయితే 25 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.
- సాగరమాల ప్రాజెక్టులో భాగంగా బుడగట్లపాలెంలో రూ.366కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మించేందుకు శంకుస్థాపన జరిగింది. ఇది పూర్తయితే మత్స్యకారుల సంపదకు గిరాకీ పెరగనుంది. టూరిజం కూడా అభివృద్ధి చెందుతుంది. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట నియోజకవర్గాల మత్స్యకారులకు ఈ హార్బర్ వల్ల ప్రయోజనం కలగనుంది.
- వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో రూ.11.95కోట్లతో జెట్టీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పుడా పనులు జోరుగా సాగుతున్నాయి.
- ఆమదాలవలస నియోజకవర్గం పొందూరు, తొగరాంలో డిగ్రీ కళాశాలలు, సరుబుజ్జిలి మండలం రొట్టవలసలో బాలికల జూనియర్ కళాశాల, వెన్నెలవలసలో వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాలలు మంజూరు చేశారు. తొగరాంలో అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల మంజూరు చేసి తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. బూర్జ మండలం పెద్దపేటలో హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ మంజూరు చేశారు. ఇలా ఆమదాలవలస నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దారు.
- ఆమదాలవలస మండలం ఇసుకలపేట వద్ద నాగావళి నదిపై జిల్లాకే దిక్సూచిగా మారిన బలసలరేవు బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. రెండు జిల్లాలను కలుపుతూ సులువుగా అతి తక్కువ దూరంలో చేరుకునేందుకు రూ.87 కోట్ల వ్యయంతో బ్రిడ్జి పనులు సాగుతున్నాయి.
- పాతపట్నం నియోజకవర్గం ఐదు మండలాల ప్రజలకు తాగునీరు అందించేందుకు రూ.265 కోట్లు విడుదల చేశారు. వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం కోసం రూ.216.72 కోట్లు మంజూరు చేశారు.
- కలగా మిగిలిన కణుగులవలస రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంతో 20 గ్రామాల ప్రజలకు విముక్తి లభించింది. గత టీడీపీ పాలనలో నాగావళి నదిపై బ్రిడ్జి నిర్మించి కణుగులవలస రోడ్డును పూర్తి చేస్తామని అప్పటి ప్రభుత్వ విప్ కూన రవి కుమార్ హామీలు ఇచ్చి గాలికివదిలేశారు.

ఇరిగేషన్ ప్రాజెక్టులు వైఎస్సార్ పుణ్యమే..

వంశధార స్టేజ్–2లో ఫేజ్ పనులంటే గుర్తుకొచ్చేది మహానేత వైఎస్సార్. సిక్కోలు పొలాలు మూడు కాలాలూ పచ్చగా ఉండాలంటే వంశధారే ఆధారమని ఆలోచించారు. దాదాపు 2.50లక్షల హెక్టార్ల ఖరీఫ్, రబీల్లో పంటలతో కళకళలాడాలంటే ఆయకట్టు అంతటికీ వంశధార జలాలు అందాలని యజ్ఞానికి సిద్ధమయ్యారు. దానిలో భాగంగా 87, 88 ప్యాకేజీ పనులు చేపట్టారు. ఆయన హయాంలోనే దాదాపు పనులు పూర్తయ్యాయి. 19.5 టీఎంసీల సామర్థ్యంతో హిరమండలం రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆయన హయాంలోనే దాదాపు పూర్తయింది. కాకపోతే, ఒడిశా పరిధిలో నేరడి వద్ద ఆనకట్ట కడితే తప్ప నీరు ప్రవహించదు. దానికి ఒడిశా ప్రభుత్వ అడ్డంకులుండటంతో సైడ్ వియర్ ద్వారా రిజర్వాయర్‌కు నీరు మళ్లించేలా పనులు చేపట్టారు.



- తోటపల్లి ఫేజ్ 2 పనుల ఘనత ఆయనకే దక్కుతుంది. ప్రాజెక్టును దాదాపు పూర్తి చేశారు. అధికారంలోకి వచ్చాక దానిని చంద్రబాబు జాతికి అంకితం చేశారు.
- సాగునీరు, తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు చేపట్టారు.
- 12,500 ఎకరాల సాగునీటి కోసం మడ్డువలస ప్రాజెక్టు స్టేజ్–1 పనులను రూ. 57.87 కోట్లతో చేపట్టారు.
- వంశధార, నాగావళి నదుల అనుసంధానం పనులు పూర్తయితే 2.55 లక్షల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని వైఎస్సార్ అప్పట్లో పనులకు శ్రీకారం చుట్టారు.

చంద్రబాబు హయాం.. హామీల మయం

- హిరమండలంలోని కల్లట–జిల్లేడుపేట గ్రామాల మధ్య మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణం హామీలకే పరిమితమైంది. మజ్జిగూడెం వద్ద సుమారు రూ.10కోట్లు ఖర్చుతో ఎత్తిపోతల పథకం పనులు అలంకారప్రాయంగా మిగిలిపోయాయి.
- వంశధార నిర్వాసితులకు చెల్లించే పరిహారంలో బినామీల పేర్లతో అక్రమాలు, విలువైన ప్రభుత్వ భూముల ఆక్రమించుకున్నారు.
- ఆమదాలవలస మండలం ముద్దాడపేట నుంచి పొందూరు మండలం గంద్రేడు వరకు నాగావళి నదిపై హైలెవల్ బ్రిడ్జి పనులకు రూ.60 కోట్ల వ్యయంతో 2019 ఫిబ్రవరి 20న శంకుస్థాపన చేశారు. టెండర్ దశ పూర్తి కాకుండానే ఎన్నికల ముందు ఓటర్లను ప్రలోభపెట్టడానికి హడావుడిగా శంకుస్థాపన చేసి వదిలేశారు.
- ఆమదాలవలస పట్టణంలో మార్కెట్ యార్డు ఆవరణలో సివిల్ సప్లై గోదాం నిర్మాణాలకు టీడీపీ ప్రభుత్వం రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించేందుకు 2016 జూన్‌లో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత గాలికొదిలేశారు.
- టీడీపీ హయాంలో 2018లో తాడివలస వద్ద రెల్లిగెడ్డపై చెక్ డ్యాంను నాసిరకంగా నిర్మించడంతో నాలుగు నెలలకే కొట్టుకుపోయింది. దీంతో 11 మండలాల భూములకు సాగునీరు అందడంలేదు. కోట్లాది రూపాయలు టీడీపీ నేతల జేబుల్లో కి వెళ్లాయే తప్ప రైతులకు మేలు జరగలేదు.
- పొందూరు–వాండ్రంగి రైల్వేగేటుపై నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 27.25 కోట్లు మంజూరయ్యాయి. రూ.12 కోట్లు పనులు చేశారు. బిల్లులు చెల్లించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.12 కోట్లు నిధులు బిల్లులు చెల్లించడంతో పాటు మిగిలిన పనులు పూర్తిచేశారు.
- వంశధార,నాగావళి నదులు అనుసంధానం చేసి రైతులకు సాగునీరు అందిస్తామని అప్పటి ప్రభుత్వ విప్ కూన రవికుమార్ చేసిన ప్రకటనలు గాలిలో కలసిపోయాయి. గడువు ముగిసినా హైలెవెల్ కాలువ పనులు పూర్తికాలేదు.
- వంశధార, మహేంద్ర తనయ పనులు కూడా గాలికొదిలేశారు.





వధూవరులకు రూ.8.76కోట్లు

- బాల్య వివాహాల నివారణే లక్ష్యం
- వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా పంపిణీలో కలెక్టర్



లబ్ధిదారులకు నమూనా చెక్ అందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకంతో వధూవరులకు ఆర్థిక లబ్ధి చేకూరనుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. పథకం మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జిల్లాస్థాయి కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్–జూన్ మధ్య వివాహం చేసుకున్న 1,436 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.8.76 కోట్ల నమూనా చెక్కును వధూవరులకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారుల తల్లుల ఖాతాలో నగదు జమ చేయనున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలను నివారించడం, పిల్లల చదువులను ప్రోత్సహించడం , పేద కుటుంబాల వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడమే పథకం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ నాగేంద్ర మీనా, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి, డీసీసీబీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు డి.వి.విద్యాసాగర్, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు వై.విశ్వమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడు అన్యాయంగా బయటకు నెట్టేశారు



నాడు ఇరపాడు నిర్వాసిత గ్రామాన్ని జేసీబీలతో కూల్చేస్తున్న వైనం (ఫైల్)

కొత్తూరు: వంశధార ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన వంశధార నిర్వాసితుల పట్ల చంద్రబాబు చేసిన మోసాలు నేటికి సజీవంగా కనిపిస్తున్నాయి. నిర్వాసితులు ప్యాకేజీలు, ఇంటి నష్ట పరిహారం పంపిణీలో టీడీపీ నేతలు చేసిన అక్రమాలు బయటపడతాయన్న భయంతో ప్రాజెక్టు పూర్తి కాక ముందే చంద్రబాబు ఆదేశాల మేరకు అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు, అప్పటి ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పోలీసుల ద్వారా నిర్వాసితులను నిర్దాక్షిణ్యంగా బయటకు పంపించేశారు. కృష్ణాపురం, అడవికొత్తూరు, ఇరపాడు, పెద్దమడి, గూనభద్ర నిర్వాసిత గ్రామాల్లో 1150 కుటుంబాలను రోడ్డున పడేశారు. సక్రమంగా ప్యాకేజీలు చెల్లించాలని కోరినందుకు గాను ఐదు వేల మందిపై కేసులు పెట్టించారు. 33 మందిని అరెస్టు చేసి 43 రోజులు పాటు జైలులో పెట్టించి ఇబ్బందులకు గురిచేశారు.

బతుకు బోల్తా

- నడిసంద్రంలో పడవ బోల్తాపడి మత్స్యకారుడు మృతి
- కొవ్వాడలో విషాదఛాయలు



రోదిస్తున్న మహిళలు (ఇన్‌సెట్లో) అప్పన్న (ఫైల్)

రణస్థలం: మండలంలోని కొవ్వాడ సముద్ర తీరంలో పడవ బోల్తాపడి అల్లిపల్లి అప్పన్న(50) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి పోతయ్య, సత్యం, కారి సీతయ్యలతో పాటు అల్లిపల్లి అప్పన్న బుధవారం ఉదయం 5.30 గంటలకు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. అరకిలో మీటరు దూరంలో అలల తాకిడికి పడవ బోల్తాపడింది. నలుగురూ సముద్రంలో పడిపోయారు. అప్పన్న మునిగిపోగా, మిగిలిన ముగ్గురు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. మిగతా మత్స్యకారులకు తెలపగా గంటపాటు వెతికిన తర్వాత అప్పన్న మృతదేహం లభించింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అప్పన్నకు భార్య చుక్కమ్మ, ఇద్దరు వివాహితులైన కుమార్తెలు, కుమారుడు రమణ ఉన్నారు. ఘటనా స్థలాన్ని మత్స్యశాఖ ఎఫ్‌డీవో గంగాధర్, గ్రామ నాయకులు పట్టయ్య, అప్పన్న పరిశీలించారు. భార్య చుక్కమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

చంద్రబాబుపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి

- హింసాత్మక రాజకీయాలు ప్రేరేపిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



చంద్రబాబు డౌన్ డౌన్ అని నినాదాలు చేస్తున్న ధర్మాన కృష్ణదాస్, తదితరులు

నరసన్నపేట: రాష్ట్రంలో హింసాత్మక ఘటనకు ప్రేరకుడైన ప్రతిపక్ష నేత చంద్రబాబుపై రౌడీషీట్ ఓపెన్ చేసి వెంటనే అరెస్టు చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. బుధవారం నరసన్నపేటలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార దాహం తీర్చుకోవడానికి చంద్రబాబు ఎంతకైనా తెగిస్తారని, ఎంత మందినైనా బలి తీసుకుంటారని మండిపడ్డారు. గతంలో ఆయన సమావేశంలో తొక్కిసలాట జరిగి పలువురు మరణించగా తాజాగా పుంగనూరులో పోలీసులపై పథకం ప్రకారం కార్యకర్తలతో దాడి చేయించారన్నారు. ఓ పోలీసు చూపు కోల్పోగా, 50 మంది గాయాల పాలయ్యారని గుర్తు చేశారు. హింసాత్మక రాజకీయాలు చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి సహనం కోల్పోతే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. టీడీపీ శ్రేణులు ఎంతగా రెచ్చగొట్టినా సంయయనం పాటించారని చెప్పారు. అలాంటి ఎస్పీపై టీడీపీ నాయకులు, చంద్రబాబు, లోకేష్‌లు ఇష్టారాజ్యంగా మాట్లాడటాన్ని కృష్ణదాస్ తీవ్రంగా ఖండించారు. ప్రాజెక్టు సందర్శన పేరుతో హింసను ప్రేరేపించడానికే జిల్లాలకు చంద్రబాబు వస్తున్నారని విమర్శించారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద జయహో జగన్..చంద్రబాబు డౌన్ డౌన్ అని నినాదాలు చేశారు.

క్లుప్తంగా

సెప్టెంబర్ నుంచి గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు



రోగితో మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశరావు

పొందూరు: గిరిజన ప్రాంతాల్లో సెప్టెంబర్ నెల నుంచి వైద్య శిబిరాలు పునఃప్రారంభంకానున్నాయని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ పాగిరి ప్రకాశరావు తెలిపారు. పొందూరులోని అభయ ఆస్పత్రిని బుధవారం సందర్శించిన ఆయన ఆరోగ్యశ్రీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకున్నారు. గర్భిణులు, అత్యవసర సేవలు అవసరమైనవారికి పలు సూచనలు చేశారు. గర్భం దాల్చినట్టు నిర్ధారణ అయిన వెంటనే ఆరోగ్యశ్రీ కార్డుతో వైద్యసేవలను ప్రారంభించుకోవాలని సూచించారు. ఆరు, ఎనిమిది, డెలివరీ ముందు తీసే స్కానింగ్‌లు పూర్తిగా ఉచితమని చెప్పారు. డెలివరీకి ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అత్యవసర సేవలు అందాల్సిన కేసులు విషయంలో ఆరోగ్యశ్రీ కార్డు అందుబాటులో లేకపోతే ముందుగా టెలిఫోనిక్ ఇంటిమేషన్ సౌకర్యం ఉందని, 72 గంటల తర్వాత ఆరోగ్యశ్రీ కార్డును ఆస్పత్రులకు అందించవచ్చునన్నారు. ఆయనతో పాటు డాక్టర్ నరేష్, ఆరోగ్యశ్రీ సిబ్బంది ఉన్నారు.

'స్వాతంత్య్ర' పోటీలకు 170 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉన్నత పాఠశాలల విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న వివిధ పోటీలకు 170 మందిని ఎంపిక చేసినట్లు రిజిస్ట్రార్ సి.హెచ్.ఎ.రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. ఎంపికైన వారికి గురువారం వక్తృత్వ, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వర్సిటీ, డిగ్రీ కళాశాలల బోధన సిబ్బంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్నారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థుల కోసం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోడ్డు నుంచి బస్సు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఉదయం తొమ్మిది నుంచి పది గంటల వరకు బస్సు అందుబాటులో ఉంటుందన్నారు. ఫైనల్ రౌండ్ విజేతలకు 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు.

టీడీపీ నేతల ధనదాహానికి ఇంజినీర్లు బలి!

- రెల్లిగెడ్డ డ్రైన్ పనుల్లో వెలుగు చూసిన అవకతవకలు
- టీడీపీ అధికారంలో ఉండగా నాసిరకం పనులు
- అనధికారికంగా సబ్ కాంట్రాక్టర్‌గా చేసిన కూన రవి సోదరుడు, అనుయాయులు
- నాడు పర్యవేక్షక ఇంజినీర్లుగా పనిచేసిన 8 మందిపై సస్పెన్షన్ వేటు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సోదరుడు, ఆయన అనుయాయుల ధనదాహానికి ఎనిమిది మంది ఇరిగేషన్ అధికారులు బలయ్యారు. అధికారంలో ఉండగా చేపట్టిన రెల్లిగెడ్డ డ్రైన్ అభివృద్ధి పనులు నాసిరకంగా ఉన్నాయని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల విచారణలో తేలడంతో పర్యవేక్షక అధికారులపై సస్పెన్షన్ వేటుపడింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల్లో భారీగా అక్రమాలు జరగడంతో ఎనిమిది మంది ఇంజినీరింగ్ అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తూ జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.


ఇదీ సంగతి..

వృథాగా పోతున్న నీటిని పంటలకు ఉపయోగించేందుకు పొందూరు మండలం కొల్లిపేట నుంచి ఆమదాలవలస మండలం నెల్లిమెట్ట వరకు రెల్లి గెడ్డ డ్రైన్ అభివృద్ధి పనులు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నాబార్డు ఆర్‌ఐడీఎఫ్–21 గ్రాంట్ నుంచి దాదాపు రూ.10 కోట్లు వరకు ఖర్చు పెట్టారు. చెక్‌డ్యామ్, రక్షణ గోడలు పనులు చేపట్టారు. పేరుకు ఆర్‌కేఎస్ అనే సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించినా కూన రవికుమార్ సోదరుడు సత్యనారాయణ, ఆయన అనుయాయులు, జన్మభూమి కమిటీ సభ్యులు సబ్ కాంట్రాక్ట్‌గా వ్యవహరించి పనులు చేపట్టారు. నాసిరకం పనులు చేపట్టడంతో కొన్ని రోజులకే తాడివలస వద్ద, సారవ గుమ్మి వద్ద చెక్ డ్యామ్‌లు కొట్టుకుపోయాయి. రెల్లిగెడ్డ కోసమని నిర్మించిన రక్షణ గోడ కొన్ని రోజులకే కూలిపోయింది. ప్రాజెక్టులో భాగంగా చేసిన మట్టి పనుల్లో కూడా అక్రమాలకు పాల్పడ్డారు. నాసిరకంగా పనులు చేపట్టడంతో నీటి ఒత్తిడిని తట్టుకోలేక గట్టుపై నుంచి పంట పొలాల్లోకి గెడ్డ నీరు వెళ్లి ముంపునకు గురి చేస్తూనే ఉంది.

మంచిగా ఉన్నవి చెడగొట్టారు..

తాడివలస గుండా ప్రవహిస్తున్న రెల్లిగెడ్డలో సారవ గుమ్మి వద్ద బ్రిటీష్ కాలం నాటి చెక్‌డ్యాం చాలా దృఢంగా ఉండేది. పంటలకు సాగునీరు చక్కగా అందుతుండేది. ఆ దృఢమైన కట్టడాన్ని జేసీబీలతో 20 రోజుల పాటు కూల్చారు. దాని స్థానంలో కొత్త చెక్ డ్యాంను నిర్మించారు. అది నిర్మించిన రెండు నెలలకు సాగునీరందించే బట్టి (కాలువ), గెడ్డను వేరుచేసే రక్షణ గోడ ఒరిగిపోయింది. దీనికి అనుసంధానంగా ఉన్న పాడవాటి గోడ ముక్కలై విడిపోయింది. దీంతో సాగునీరు పంటలకు అందించే కాలువలోకి (బట్టి) వెళ్లకుండా గెడ్డలోకి వెళ్లిపోయి నాగావళి నదిలో కలిసిపోతోంది. గెడ్డలో అడ్డంగా ఉన్న పెద్ద గోడ, గేట్లు అన్నీ ముక్కముక్కలై నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి.

అంతా నాసిరకమే..



జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులు

పనులు సక్రమంగా జరగకపోవడంతో నదిలోకి వెళ్లాల్సిన నీరు వెనక్కి వచ్చేస్తోంది. సింగూరు వద్ద ఎత్తును డౌన్ చేసే పనులు జరగాలి. కాలువ ఇరువైపులా లోతు చేయాలి. రక్షణ గోడలు నిర్మించాలి. ఆ పనులు సరిగ్గా నిర్మించకపోవడంతో ముందుకెళ్లాల్సిన నీరు వెనక్కి వచ్చేస్తోంది. మొదలవలస వద్ద కాలువలో మట్టి పనులు సక్రమంగా చేయలేదు. దీంతో రెల్లిగెడ్డ గట్టుపై నుంచి నీరు పొలాల్లోకి వెళ్లిపోతోంది. తాడివలసలో సారవగుమ్మి వద్ద అధికారులు నిర్దేశించిన ప్లాన్ ప్రకారం పనులు చేయలేదు. చెక్ డ్యామ్‌లు, రక్షణ గోడలు సరిగ్గా నిర్మించకపోవడంతో నీటి ఒత్తిడికి గేట్లు కొట్టుకెళ్లిపోయాయి. రక్షణ గోడ కొంతభాగం కూలిపోయింది. ఫలితంగా పంట పొలాలకు అందాల్సిన నీరు వృథాగా నదిలో కలిసిపోతోంది. రెల్లి గెడ్డ పనులు సరిగా చేపట్టకపోవడం వల్ల దానికి ఆనుకుని ఉన్న బొడ్డేపల్లి, మొదలవలస, తాడివలస, కింతలి, అచ్చిపోలవలస, పూడివలస, సనపలవానిపేట, తమ్మినాయుడు, గోకర్నపల్లి, గోరింట, తుంగపేట, తోలాపి, దళ్లవలస తదితర గ్రామాల్లో పంట భూములకు చిత్రకరమైన పరిస్థితి ఎదురవుతోంది. అధికంగా వర్షాలు పడితే పంట భూములు ముంపునకు గురవుతున్నాయి. తక్కువ వర్షాలు పడితే సాగునీరు అందని దుస్థితి. దీనికంతటికీ పనులు నాసిరకంగా ఉండటమే కారణం. అధికారుల పర్యవేక్షణ లేకుండా పనులు సాగడంతో నాణ్యతకు నోచుకోలేదు. ఈ గెడ్డ పనులు సక్రమంగా జరగకపోవడంతో దానికి ఆనుకుని సుమారు రూ.2.86 కోట్లతో నిర్మించిన రోడ్డు వరద నీటి దాటికి ఎప్పటికప్పుడు ధ్వంసమవుతోంది. దీనిపై 2020లో 'సాక్షి'లో వరుసగా కథనాలు ప్రచురితమయ్యాయి.



రెల్లిగెడ్డ డ్రైన్ పనుల అక్రమాలపై 'సాక్షి'లో వచ్చిన కథనం

ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

రెల్లిగెడ్డ పనుల అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. స్పీకర్ తమ్మినేని సీతారాంతో పాటు మరికొంతమంది ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో విచారణ జరిపించారు. నాసిరకం పనులు, అక్కడ జరిగిన అక్రమాలు బయటపడ్డాయి. దీంతో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు సమగ్రమైన విచారణ నివేదిక వెళ్లింది. దీని ఆధారంగా చేసుకుని తాజాగా చర్యలకు ఉపక్రమించారు. పనుల పర్యవేక్షణలో విఫలమయ్యారని, నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న అభియోగాలతో ఎనిమిది మంది ఇంజినీరింగ్ అధికారులను తాజాగా సస్పెండ్ చేస్తూ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో ఈఈ బి.రవీంద్ర, డీఈఈలు కె.వి.క్రాంతికుమార్, ఎం.శ్రీరంగనాయకులు, టి.హరిప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.సాంబమూర్తి, డి.వి.రమణ, జి.మోసెస్, సూపరింటెండెంట్ బి.గోమతి లక్ష్మి ఉన్నారు.

స్వాతంత్య్ర మహోత్సవంలో భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వాతంత్య్రం కోసం అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఔన్నత్యాన్ని దశదిశలా చాటి చెప్పేందుకు స్వాతంత్య్ర మహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ స్మృతి వనంలో నా మట్టి– నా దేశం ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మేరా మట్..మేరా దేశ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ముగింపు కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రతిజ్ఞ, అమరవీరులకు వందనం, ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటే వసుధా వందనం, భారత ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశంతో కూడిన శిలాఫలకాల ఆవిష్కరణ, అమరవీరులను గుర్తించడం వంటి ఐదు రకాల కార్యక్రమాలను ఈ నెల 15వ తేదీ వరకు జిల్లాలోని 912 గ్రామ పంచాయతీలతో పాటు 75 వార్డుల్లో నిర్వహిస్తామన్నారు. 15వ తేదీ తరువాత ప్రతి గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గం నుంచి కొంత మట్టిని సేకరించి ఢిల్లీకి పంపించనున్నట్టు వివరించారు. అక్కడ కూడా ప్రత్యేక కార్యక్రమం జరుగుతోందన్నారు. జిల్లాలోని వద్ధులు, పెద్దలు, పిల్లలు అందరూ వారి స్థాయిలో స్వాతంత్య్ర మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక మాట్లాడుతూ.. స్వాతంత్య్ర మహోత్సవ వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. పోలీస్ అమరవీరులను స్మరించుకోవడం, వారి కుటుంబాలను సన్మానించనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా పోలీస్ శిక్షణ కళాశాలలో మొక్కలు నాటడం జరిగిందనిన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం అమరులైన త్యాగమూర్తులను స్మరించుకోవడంతో పాటు మన దేశ ఔన్నత్యాన్ని, కీర్తి ప్రతిష్ఠలను ముమ్ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, మెప్మా పీడీ కిరణ్, జెడ్పీ సీఈవో వెంకట్రామన్, డ్వామా పీడీ చిట్టిరాజు, ఆయుష్ డాక్టర్ జగన్నాథం, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, ఎన్‌వైకే కోఆర్డినేటర్ ఉజ్వల, గాంధీ మందిర్ కమిటీ ప్రతినిధులు ఎం.ప్రసాదరావు, జోగునాయుడు, కె.వేణుగోపాల్, ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి, వి.జగన్నాథనాయుడు, నక్క శంకరరావు, కొంక్యాన మురళీధర్, గుర్తు చిన్నారావు, దేవభూషణరావు, నటుకుల మోహన్, పొన్నాడ రవి, హారిక ప్రసాద్, పందిరి అప్పారావు, ఎం.అనంత భట్లు, ఆర్మీ కాలింగ్ ప్రతినిధులు రమణ, కిరణ్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్, ఎస్పీ రాధిక తదితరులు

ఆత్మస్థైర్యంతోనే విజయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే విజయం సాధించగలరని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలసలోని మార్కెట్ యార్డు ఆవరణలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అలిమ్‌కో సంస్థ సహకారంతో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ ఉపకరణముల కోసం గుర్తింపు శిబిరాన్ని బుధవారం నిర్వహించగా.. దీన్ని స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు ఎవరి కన్నా తక్కువ కాదని, అన్ని రంగాల్లో విజయం సాధిస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం దివ్యాంగుల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిపై అవగాహన కల్పించుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు కాని పథకాలను వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం రాష్ట్రంలో అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏదైనా పని నిమిత్తం దివ్యాంగులు వెళితే వారికే మొదటిగా అవకాశం కల్పించాలని, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సీఎం ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గంలో గల దివ్యాంగులు, వయోవృద్ధులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి త్వరలోనే అందజేయడం జరుగుతుందన్నారు. భారత ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం అలిమ్‌కో సహకారంతో ఈ ఉపకరణాలను ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గుర్తింపు శిబిరంలో భాగంగా శారీరక వైకల్యం, దృష్టిలోపం, బధిరులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాలను త్వరలోనే నియోజకవర్గాల వారీగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ కవిత, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు, లావేరు ఎంపీడీవో సురేష్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

సీఎం జగన్‌తోనే గిరిపుత్రుల సంక్షేమం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: గిరిపుత్రుల సంక్షేమానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గిరిజనుల సంక్షేమం సాధ్యమని చెప్పారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మందసలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం హయాంలో గిరిజనాభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన కుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులకు ఎంతో న్యాయం చేశారన్నారు. 50 ఏళ్లకే పింఛన్లు, పోడుభూముల పట్టాలు అందించారన్నారు. గిరిజనుల ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు పేరిట జిల్లాను కూడా ఏర్పాటు చేశారన్నారు. గిరిజనులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూర్చడానికి రాష్ట్రంలో రెండు మెడికల్ కళాశాలలు ఏర్పాటు, సీతంపేటలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తున్నామన్నారు. గిరిబిడ్డలను విద్యావంతులుగా మార్చడానికి పలు పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేసి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతి గిరిజన ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు.

గౌతు కుటుంబం.. ఓట్ల రాజకీయం..

గిరిజనులను గౌతు కుటుంబం ఓటు బ్యాంకుగానే మలుచుకుందని, వారికి అభివృద్ధి అంటే ఏమిటో తెలియనివ్వకుండా చేసిందని మంత్రి అప్పలరాజు ఆరోపించారు. మందస మండలంలోని కొయిటూసాయి అనే గిరిజన గ్రామంలో ఓట్లు దండుకున్న గౌతు కుటుంబీకులు కనీసం ఆ ప్రాంత గిరిజనులను పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మాత్రమే రహదారులు నిర్మించడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తుంటే.. చేయూత నిధులతో గిరిజనులు అభివృద్ధి చెందుతున్న పరిస్థితులు ఎంతో స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జేఏసీ నాయకుడు సవర నీలకంఠం, ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యుడు సవర కుమారి, ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు సవర చంద్రరావు, ఎస్.డొంబురు, ఎస్.సీతారాం, బాలకృష్ణ, కామయ్య, గిరిజన సంఘం అధ్యక్షుడు సవర ధర్మారావు, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సవర హరికృష్ణ, గిరిజన సర్పంచ్‌లు సవర రోజా, సవర నవిత, సవర సుధాకర్, మజ్జి కుమార్‌చంద్ర, సవర సంధ్య, సవర లక్ష్మీప్రియ, ఎంపీటీసీ సభ్యులు సవర హరినారాయణ, సవర ఢిల్లేశ్వరి, సవర కాంచన, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు



ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆల్ ట్రేడ్ యూనియన్లు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కలెక్టరేట్ వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలన్నారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో కార్మిక సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర గ్యారంటీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహనరావు, కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాశ్, రైతు సంఘం నాయకుడు బలగ శ్రీరామమూర్తి, గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి డి.గణేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చిక్కాల గోవిందరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.పార్వతీశం, బి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.